# తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తూ మహిళా రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



నంగునూరు: పాలమాకులలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

**ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి**

గజ్వేల్, మే 22: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ధర్మారెడ్డిపల్లి, ముట్రాజ్‌పల్లి రింగ్‌రోడ్డుపై తడిసిన ధాన్యాన్ని వారు పరిశీలించి మహిళా రైతులతో మాట్లాడి కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజుల్లోగా ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి అక్కడి నుంచి తరలించని పక్షంలో రాజీవ్ రహదారిపై ధాన్యం ట్రాక్టర్లతో దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కేసీఆర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడంతో రాష్ట్రంలో వరి దిగుబడి పెరిగిందని, కొనుగోలు చేయడంతో ప్రభుత్వం విఫలమైందన్నారు. రేవంత్‌రెడ్డికి పాలన చేతకాక చేతులెత్తేశారని,అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంతో సీఎం విఫలమయ్యారని ఆరోపించారు. గన్నీబ్యాగులు, లారీలను సమకూర్చడంలో అధికారులు చొరవ తీసుకోకపోవడంతో నేటికీ కొనుగోలు కేంద్రాల్లోనే వేలాది క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉందన్నారు. రైతు ఆత్మహత్యలను నివారించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మిస్తే అది జీర్ణించుకోలేక రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కక్షకట్టి అవినీతి మచ్చ వేస్తూ నోటీసులు పంపడం సిగ్గుచేటన్నారు. కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్న ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రైతు రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయని ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే నైతికహక్కు లేదన్నారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశంగౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజు, నర్సింగరావు, కనకయ్య, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

**రైతులను విస్మరిస్తే గుణపాఠం తప్పదు**

నంగునూరు, మే 22 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను విస్మరిస్తే గుణపాఠం తప్పదని మాజీ ఏఎంసీ చైర్మన్ సోమిరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య అన్నారు. గురువారం మండలంలోని పాలమాకులలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు యాసంగి, వానకాలం రెండు పంటలకు రైతుబంధు అందించి ఆదుకుందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అని చెప్పి రైతులకు సమయానికి డబ్బులు ఇవ్వడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అభివృద్ధే ధ్యేయగా పనిచేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రైతులకు పచ్చిరొట్టె, జీలుగ విత్తనాలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్, మాజీ ఏఎంసీ వేణు చక్రవర్తి, మాజీ ఎంపీటీసీ శంకర్, వేల్పుల ఐలయ్య, వెంకట్, కుమార్, బాలమల్లు, బుచ్చయ్య పాల్గొన్నారు.

## మిరుదొడ్డి తహసీల్దార్‌కు సన్మానం

మిరుదొడ్డి, మే 22 : మిరుదొడ్డి మండల నూతన తహసీల్దార్‌గా శ్రీనివాస్ ఈ నెల 19వ తేదీన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకులు గురువారం తహసీల్దార్‌ను కలిసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ బాల్‌రాజు, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, నాయకులు గొల్ల రాములు, వెంకటయ్య,పరశురాములు, మల్లయ్య, నాగేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



మిరుదొడ్డి తహసీల్దార్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## శిక్షణ తరగతులను సందర్శించిన డీఈవో

తొగుట/మిరుదొడ్డి, మే 22 : తొగుట మండలం గుడికందుల జడ్పీ పాఠశాలలో మండల స్థాయి ఉపాధ్యాయ శిక్షణ తరగతులు మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం డీఈవో శ్రీనివాస్‌రెడ్డి శిక్షణ తరగతులను సందర్శించి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక భాష, గణిత భావాలను కృత్యాధార పద్ధతిలో విద్యార్థులకు నేర్పించేందుకు శిక్షణ తరగతులు దోహదం చేస్తాయన్నారు. ఎంఈవో నర్సయ్య, టీచర్లు రామచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



గుడికందుల జడ్పీ పాఠశాలలో శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

## దేవతామూర్తుల ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

మద్దూరు(ధూళిమిట్ట), మే22: మద్దూరు మండలంలోని లద్నూర్ వీరభద్ర స్వామి ఆలయంలో ఆంజనేయ, కాలభైరవ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అర్చకులు దూసకంటి రాజేశ్‌శర్మ, వంశీకృష్ణశర్మ, సాయిచరణ్, వైదిక నిర్వహణలో ఉదయం గణపతి పూజ, పుణ్యావాచనం, అఖండ దీపారాధన, రక్షా బంధనం, గోపూజ, పంచగవ్యప్రాసన, మంటపారాధన,ఆవాహిత దేవతా పూజులు, అగ్ని ప్రతిష్ఠ ఆవాహిత దేవతహవనములు, సాయంత్రం జలాధివాసం, రాజోపచార పూజ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



లద్నూర్‌లో ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్న అర్చకులు

## నిరుపేద కుటుంబానికి బియ్యం అందజేత

చిన్నకోడూరు, మే 22: మండలంలోని రామంచలో ఇటీవల మరణించిన నిరుపేద పెద్దేల్లి రాజు కుటుంబానికి లయన్స్ క్లబ్, సిద్దిపేట ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు. దాతలు ఆకుల పాండు, మురికి కాశీనాథ్, గంప రమేశ్ ఆర్థిక సహాయంతో నిరుపేద కుటుంబానికి చేయూత అందించారు.

## గజ్వేల్ మున్సిపాలిటీకి ‘ఉత్తమ పర్యావరణ పనితీరు అవార్డు’

గజ్వేల్, మే 22: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పనితీరుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు ‘ఉత్తమ పర్యావరణ పనితీరు అవార్డుకు’ ఎంపిక చేసింది. ఈ అవార్డును ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5న టీజీపీసీబీ ఆడిటోరియంలో కాలుష్య నియంత్రణ మండలి చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ నర్సయ్య అందుకోనున్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

కొమురవెల్లి, మే 22 : గ్రామ సభలు నిర్వహించి అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు.గురువారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో బద్దిపడగ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సీసీ రోడ్లు వేసిన క్రమంలో రూ. లక్షకు రూ.10వేలు వసూలు చేసి కాంగ్రెస్ నాయకులు అవినీతికి పాల్పడ్డారని, ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్ల విషయంలో రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.గ్రామసభలు పెట్టి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తించాలని అధికారులను కోరారు.ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే వారికి షరతులు విధించవద్దని సూచించారు. తాము చెప్పిన వారికే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు పాల్పడే ధోరణి మానుకోవాలన్నారు.సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సత్తిరెడ్డి, మండల కార్యదర్శి రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు శారత, మండల నాయకులు ఇస్తారి, మల్లేశం, సాయిలు, బాలకిషన్, శ్రీను, చక్రపాణి, భిక్షపతి పాల్గొన్నారు.

## అప్పనపల్లిలో పసికందు అపహరణ

దుబ్బాక,మే22: తల్లిఒడిలో నుంచి పసికందును అపహరించిన ఘటన దుబ్బాక మండలం అప్పనపల్లిలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామానికి చెందిన రామగల శ్రీమాన్ డెకరేషన్ పనిచేస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శ్రీమాన్‌కు భార్య కవితతో పాటు రెండు నెలలు కుమారుడు ఉన్నారు. ఉపాధి నిమిత్తం శ్రీమాన్ భార్య, కుమారుడితో కలిసి దుబ్బాక మండలం అప్పనపల్లిలో తన బంధువు గ్యార ఎల్లవ్వ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 17న శ్రీమాన్ మిరుదొడ్డి మండలం రుద్రారంలో ఉన్న సోదరి ఇంటి వద్ద పని ఉందని వెళ్లాడు. ఈ క్రమంలో కవిత తన రెండు నెలల కుమారుడితో ఉంటుంది. బుధవారం రాత్రి అప్పనపల్లిలో కవిత తన కుమారుడిని ఎత్తుకుని ఆరుబయట ఉండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి మాయమాటలు చెప్పి పసికందును అపహరించుకుపోయారని తెలిపింది. ఈ విషయంపై కవిత తన భర్త శ్రీమాన్‌తో కలిసి దుబ్బాక పీఎస్‌లో గురువారం ఉదయం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.

## దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్ ప్రారంభం

చేర్యాల, మే 22 : రానున్న దసరా పర్వదినం రోజున కొమురవెల్లిలో రైల్వే స్టేషన్‌ను ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు.హైదరాబాద్‌లో గురువారం బేగంపేట్, కరీంనగర్, వరంగల్‌లో అమృత్ భారత్ రైల్వేస్టేషన్లు ప్రారంభించిన సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడారు. సెప్టెంబర్,అక్టోబర్ మాసాల్లో పనులు పూర్తి చేసి కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభించి మల్లన్న భక్తులకు అంకితం చేస్తామన్నారు.కేంద్ర మంత్రి ప్రకటనతో మల్లన్న భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మల్లన్న క్షేత్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో రైల్వేస్టేషన్ పనులు మందకొడిగా సాగుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి సకాలంలో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కొమురవెల్లి గ్రామస్తులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట,మే22: వర్షాలు కురుస్తున్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి జిల్లాలో ఎలాంటి నష్టం కలుగకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. టెలి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుచౌదరి పాల్గొని జిల్లాలోని పరిస్థితిని వివరించారు. జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, ఇప్పటివరకు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, మరో 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వెంటనే ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా మిల్లులకు రవాణా చేస్తున్నామని, తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపిస్తున్నామని వివరించారు. అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, జిల్లా సహకార అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

సిద్దిపేట టౌన్,మే 22 : కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం అన్నారు. సిద్దిపేట కార్మిక సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పనిచేయాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న కార్మికులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు.ప్రమాదవశాత్తు గాయపడిన కార్మికులకు 5వేల పెన్షన్, ఉచిత వైద్యం, రూ.50 వేలు ఉన్న పెండ్లి కానుక లక్షకు పెంచాలని, ఆరు లక్షలు ఉన్న ప్రమాద బీమాను 10 లక్షలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు పరశురాములు, రాజు, నర్సింహులు, శ్రీనివాస్,రాజు, నందం, వేణు పాల్గొన్నారు.

## కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను ఆపాలి

సిద్దిపేట,మే22: కేంద్రం ఆపరేషన్ కగార్‌ను తక్షణమే ఆపాలని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాగుల భూపతి, ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ సత్తయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ.శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం సిద్దిపేట పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్‌లో కేంద్రం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలంటూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ అడవుల్లో ఉన్న సహజ వనరులను కార్పొరేట్ , బడా పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయడం కోసం కేంద్రం ఆదివాసులను హతమారుస్తున్నదన్నారు. కూంబి ఙ్ పేరిట ఆదివాసీ మహిళలపై లైంగికదాడు లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత బహుజన, ప్రజా సంఘాల నాయకు లు భీమసేన,రోమాలబాబు, కేఎన్‌పీఎస్, పీడీఎం, డీబీఎఫ్ ,బీడీఎస్‌ఎఫ్,రైతు సంఘా ల నాయకులు భిక్షపతి,కమలాకర్, కొమ్ము దుర్గారాములు ,దబ్బేట ఆనంద్, యాదగిరి ,శేఖర్, న్యాయవాది విజయ్ కుమార్,రాజు, రిటైర్డు టీచర్ నర్సింహులు పాల్గొన్నారు.

## దళిత వైతాళికుడు భాగ్యరెడ్డివర్మ : కలెక్టర్

సిద్దిపేట,మే22: దళిత వైతాళికుడు మ్యాదరి భాగ్యరెడ్డి వర్మ అని కలెక్టర్ మను చౌదరి అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాదరి భాగ్యరెడ్డి వర్మ జయంతిలో అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దళిత వైతాళికుడిగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కవిత పాల్గొన్నారు.



భాగ్యరెడ్డి వర్మ జయంతిలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

**గొప్ప సంఘసంస్కర్త భాగ్యరెడ్డి వర్మ**

హుస్నాబాద్‌టౌన్, మే 22: తెలంగాణలో గొప్ప సంఘసంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా గ్రంథాలయ సంస్థచైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. హుస్నాబాద్‌లో గురువారం సంఘసంస్కర్త భాగ్యరెడ్డి వర్మ జయంతి నిర్వహించారు. మున్సిపల్‌కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్ , శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లం, మాజీకౌన్సిలర్లు రవీందర్, హరీశ్, ఎండీ అయూబ్, నాయకులు వెన్న రాజు, కొంకట రవీందర్, బొల్లి శ్రీనివాస్, గంపల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

చేర్యాల, మే 22 : అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ కోరారు.గురువారం మండలంలోని రాంపూర్‌లో సీపీఐ రెండో మహాసభ బండారి సిద్ధయ్య అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకపోవడం వల్ల వారికి భద్రత కరువైందన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థను ముందుకు తీసుకుపోవడంలో కీలకమైన హమాలీ కార్మికులకు వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు.రాంపూర్‌లో ఉన్న బీటీ రోడ్డు పూర్తి ధ్వంసమైందని, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అధికారులు మరమ్మతులు చేయాలన్నారు.రాంపూర్ నుంచి కొత్త దొమ్మాట వరకు బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు.అనంతరం రాంపూర్ గ్రామ కార్యదర్శిగా నర్సయ్య, సహాయ కార్యదర్శులుగా నాగభూషణం, బండారి కనకయ్య, కోశాధికారిగా రంగు శంకర్, సోషల్ మీడియా అధ్యక్షుడిగా శెట్టె అనిల్, ప్రచార కార్యదర్శిగా నర్సింహులు ఎన్నికయ్యారు.




రాంపూర్‌లో మాట్లాడుతున్న అశోక్

## సాగుపద్ధతులపై అవగాహన కలిగి ఉండాలి

జగదేవపూర్, మే22: సాగుపద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని అలిరాజ్‌పేటలోని రైతు వేదికలో ఏరువాక కేంద్రం వ్యవసాయ పరిశోధన స్థానం తోర్నాల ఆధ్వర్యంలో రైతులకు సాగుపద్ధతులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త భవాని మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా రసీదు పొందాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని రైతులకు సూచించారు. పంట దశలను బట్టి ఎరువులను రెండు నుంచి మూడు దశల్లో వాడుకోవాలన్నారు. మండలానికి 150 క్వింటాళ్ల జీలుగ, 30 క్వింటాళ్ల జనుము విత్తనాలు కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ ఎరువులు, విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల నాయకులు రవీందర్‌రెడ్డి, వెటర్నరి అధికారిణ శ్వేత, వెటర్నరి సర్జన్ భవాని, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

**కలెక్టర్ మనుచౌదరి**

సిద్దిపేట,మే22: గ్రామ పాలన అధికారుల పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.మనుచౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో గ్రామ పాలన అధికారుల పరీక్ష నిర్వహణ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన సిద్దిపేటలోని పభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రామ పాలన అధికారుల పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. మొత్తం 142 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులను ఉదయం 9:30 నుంచి 10 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని సూచించారు. అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, ఏసీపీ రవీందర్, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, అసోసియేట్ ప్రొఫెసర్ అయోధ్య రెడ్డి, విద్యుత్ శాఖ డీఈ శ్రీనాథ్, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

**క్షేత్రస్థాయి పరిశీలన పూర్తిచేయాలి**

ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాల లబ్ధిదారుల క్షేత్ర స్థాయి పరిశీలన వేగంగా పూర్తిచేసి అర్హులను ఎంపిక చేయాలని కలెక్టర్ ఎం. మనుచౌదరి అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలపైన జిల్లా, మండల అధికారులు, అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్‌తో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులను మార్గదర్శకాల ప్రకారం పరిశీలన పూర్తిచేయాలన్నారు. మండల స్థాయి కమిటీని సంప్రదించి జిల్లాకు ఇచ్చిన టార్గెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఆయా యూనిట్లకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని, కొత్త పనులు గుర్తించాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో రమేశ్, బీసీ వెల్ఫేర్ అధికారి నాగరాజమ్మ, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, హౌసింగ్ అధికారి దామోదర్‌రావు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

నంగునూరు, మే 22 : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని దుకాణాదారులను జిల్లా వ్యవసాయాధికారి రాధిక ఆదేశించారు. గురువారం నంగునూరుతో పాటు గట్లమల్యాల లో పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. నంగునూరు మండల కేంద్రంలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రైతులకు పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేశారు. ఏవో గీత, ఏఈవో సాయివర్మ, రైతులు పాల్గొన్నారు.

**విత్తన విక్రయ దుకాణాల ఆకస్మిక తనిఖీ**

బెజ్జంకి, మే 22: మండల కేంద్రంలోని సీడ్స్, ఫర్టిలైజర్, ఎరువుల దుకాణాలను ఏఎస్సై శంకర్‌రావు, ఏవో సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సేల్స్, స్టాక్ రిజిస్టర్లు, విత్తన కంపెనీల అనుమతులు, నిల్వలను పరిశీలించారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వాకె హెచ్చరించారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.





గట్లమల్యాలలోని ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను తనిఖీచేస్తున్న డీఏవో రాధిక

## ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు

బెజ్జంకి, మే 22: మండలంలోని ముత్తన్నపేట గ్రామ శివారులోని వనదేవతలకు చెందిన ప్రభుత్వ భూమిని కొంత మంది కబ్జాచేశారని నాయబ్ తహసీల్దార్ గోపాల్, పోలీస్‌స్టేషన్‌లో గ్రామ దళితులు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనదేవతల కోసం కేటాయించిన భూమిని కొంత మంది అన్యాక్రాంతం చేశారని వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని విన్నవించారు.

**బెజ్జంకి తహసీల్దార్‌గా చంద్రశేఖర్**

బెజ్జంకి తహసీల్దార్‌గా చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై వచ్చారు. కార్యాలయ సిబ్బంది శాలువాతో ఆయన్ను సత్కరించారు.



నాయబ్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దళితులు, గ్రామస్తులు



చేర్యాలలో హనుమాన్ జయంతిలో పాల్గొన్న భక్తులు



గజ్వేల్: పాండవుల చెరువుకట్టపై ఆంజనేయస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి




మద్దూరు(ధూళిమిట్ట): గాగిళ్లాపూర్‌లో హన్‌మాన్ శోభాయాత్రలో పాల్గొన్న స్వాములు

## వైభవంగా హన్‌మాన్ జయంతి

జిల్లా వ్యాప్తంగా భక్తులు హనుమాన్ జయంతిని జరుపుకొన్నారు. గురువారం భక్తులు ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. హనుమాను స్వాముల ఆధ్వర్యంలో శోభాయాత్రలు నిర్వహించారు. కొన్నిగ్రామాల్లో భక్తులకు అన్నదానం చేశారు. దీంతో గ్రామాలన్నీ రామనామ స్మరణతో మార్మోగాయి.

–సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, మే22



చిన్నకోడూర్: చంద్లాపూర్‌లో హనుమాన్ జయంతిలో పాల్గొన్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ



సిద్దిపేట: రంగధాంపల్లి హనుమాన్ ఆలయంలో మాలవిరమణ చేస్తున్న హనుమాన్ స్వాములు

### విహాన్‌రామ్‌కు అభినందనలు

మద్దూరు(ధూళిమిట్ట), మే22: ధూళిమిట్ట మండలం హనుమతండాకు చెందిన యువ అంతర్జాతీయ పర్వతారోహకుడు జాటోత్ విహాన్‌రామ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల అందుకున్న ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్, మెడల్‌ను కేంద్రమంత్రి నుంచి విహాన్‌రామ్ అందుకున్నాడు. మారుమూల గిరిజన తండాకు చెందిన బాలుడు కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించడం తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని మంత్రి కొనియాడారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ పర్వతాలు అధిరోహించి తెలంగాణ రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని మంత్రి ఆకాంక్షించారు.

### కాళీమాత ఆశ్రమ వార్షికోత్సవాలు ప్రారంభం

మద్దూరు(ధూళిమిట్ట), మే22: మద్దూరు మండలం గాగిళ్లాపూర్‌లో కాళీమాత ఆశ్రమ 39వ వార్షికోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం కాళీమాత అమ్మవారికి అభిషేకం, శివాలయంలో లింగాభిషేకం, రుద్రచండీహోమంతో పాటు అమ్మవారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కుంకుమార్చన నిర్వహించారు. వార్షికోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆశ్రమ నిర్వాహకులు న్యాయవాది గుర్రం నారాయణ కోరారు.

### ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు జారీ

చేర్యాల, మే 22 : విద్యాశాఖ గుర్తింపు లేకుండా పట్టణంలో కొనసాగుతున్న శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం గ్రామాల్లో కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తుండడంతో గురువారం మండల విద్యాశాఖాధికారి ఆర్.కిష్టయ్య నోటీసులు జారీ చేశారు. సీబీఎస్ఈ గుర్తింపు లేకుండా ఉందని ప్రచారం చేస్తున్న మరో ఇంటర్నేషన్ స్కూల్‌కు నోటీసు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ చైతన్య పాఠశాలకు గుర్తింపు లేదని విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించాలని సూచించారు.

### పాముకాటుతో రెండు ఆవులు మృతి

చేర్యాల, మే 22 : మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన సొంరెడ్డి యశ్వంత్‌రెడ్డి అనే రైతుకు చెందిన ఆవులు పాము కాటుతో మృత్యువాత పడ్డట్లు బాధిత రైతు తెలిపారు. బుధవారం వ్యవసాయ బావి వద్ద ఆవులను కట్టేసి ఇంటికి వచ్చిన రైతు గురువారం ఉదయం వెళ్లి చూసేసరికి రెండు ఆవులు మృతిచెందినట్లు గమనించారు.పరిసరాల్లో గమనిస్తే పాములు కనిపించాయని తెలిపారు. సంబంధితశాఖ అధికారులు స్పందించి బాధిత రైతుకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### కేసు ఛేదించిన ఏసీపీ పురుషోత్తంరెడ్డికి అభినందన

గజ్వేల్, మే 22: లైంగికదాడి, హత్య, పోక్సో కేసులో నేరస్తుడికి ఉరిశిక్ష పడిన కేసులో ఇన్వెస్టిగేషన్ అధికారి ఏసీపీ పురుషోత్తంరెడ్డిని గురువారం అభినందించి కమాండేషన్ సర్టిఫికెట్‌ను డీజీపీ జితేందర్ హైదరాబాద్‌లోని కార్యాలయంలో ప్రదానం చేశారు. అదిత్రి కన్‌స్ట్రక్షన్‌లో కూలి పని చేస్తున్న శంకర్ మనుమరాలు ఐదేండ్ల పాపపై బీహారుకు చెందిన 56ఏండ్ల గఫర్ అలీ అత్యాచారం చేసి హత్య చేసినట్లు ఫిర్యాదు చేయడంతో సంగారెడ్డి జిల్లా బీడీఎల్ బానూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అక్కడే విధుల్లో ఉన్న డీఎస్పీ పురుషోత్తంరెడ్డి కేసు విచారణ ప్రారంభించి నేరస్తుడిని అరెస్టు చేసి కీలక ఆధారాలు సేకరించి విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ వేశారు. విచారణ అనంతరం నేరస్తుడు గఫర్‌అలీపై నేరం రుజువుకావడంతో మరణశిక్ష విధించారు. ఈ కేసును త్వరగా విచారణ పూర్తి చేసి అప్పటి పటాన్‌చెరు డీఎస్పీ, ప్రస్తుత గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డిని తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ అభినందించి కమాండేషన్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

### జూదం స్థావరంపై పోలీసుల దాడి

గజ్వేల్, మే 22: పట్టణంలోని లక్ష్మీప్రసన్ననగర్ కాలనీలోని గంగిశెట్టి సంతోష్ ఇంట్లో కొంతమంది జూదం ఆడుతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.29,800 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జూదం ఆడుతూ పట్టుబడిన వారిలో దొంతి నర్సింహులు, నక్కల వెంకట్, నిరుడి నాగరాజు, ఎస్‌కే ఫర్దుస్ ఉన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**మందుబాబుకు జైలు శిక్ష**

గజ్వేల్, మే 22: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్షను జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ స్వాతిగౌడ్ విధించినట్లు ట్రాఫిక్ సీఐ మురళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం తాగి వాహనాల తనిఖీ ల్లో పట్టుబడిన ఐదుగురికి రూ.6500 జరిమానా విధించినట్లు తెలిపారు.

### బాధ్యతలు స్వీకరించిన సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి

సిద్దిపేట టౌన్,మే 22 : సిద్దిపేట నూతన ఏసీపీగా రవీందర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. పోలీసు అధికారుల బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు పనిచేసిన మధు డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రవీందర్‌రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. శాంతి భద్రల పరిరక్షణకు సహకరించాలని ఆయన కోరారు.